క్లుప్తంగా

పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



స్వచ్ఛత ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్ తదితరులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణాభివృద్ధి, పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్వచ్ఛతే సేవా – గార్బేజ్ ఫ్రీ ఎమ్మిగనూరు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో స్థానిక ఎంఎస్ జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినిలు, ఎన్‌సీసీ, స్కౌట్ విద్యార్థులు,కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, వ్యాపారులు పెద్ద ఎత్తునా ర్యాలీ చేపట్టారు.కూరగాయల మార్కెట్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టి ఎంబీ చర్చి నుంచి కలుగొట్ల రోడ్డు వరకు ఇరువైపులా మొక్కలను నాటారు. మున్సిపల్ డీఈలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆస్పరికి మంత్రి రాక

ఆస్పరి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభించేందుకు మంత్రి గుమ్మనూరు జయరాం శనివారం ఆస్పరికి రానున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. శుక్రవారం ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్లో కార్యక్రమం ఏర్పాట్లపై ఎంపీడీఓ, డాక్టర్ రఘురామిరెడ్డి, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, ఈఓ రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుంకర రామాంజినేయులు పరిశీలించారు. డాక్టర్ మాట్లాడుతూ.. శిబిరంలో అన్ని రకాల రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముమ్మరంగా విత్తన రిజిస్ట్రేషన్లు

ఆస్పరి: ఆస్పరి సచివాలయాలలో సబ్సిడీ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. రెండు సచివాలయాలలో శుక్రవారం 300 మంది రైతులు విత్తనాల కోసం నమోదు చేసుకున్నారని వీఏఓలు జ్యోతిర్మయి, అనిల్ తెలిపారు. ఆస్పరితో పాటు మండలంలోని చిన్నహోతూరు, జొహరాపురం, శంకరబండ, హలిగేర, చిగిళి, బిణిగేరి, నగరూరు గ్రామాలలో విత్తన రిజిస్ట్రేషన్ల కార్యక్రమం కొనసాగుతుందని ఏఓ తెలిపారు.

పేదల పక్షపాతి సీఎం జగన్



ఎం.అగ్రహారంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆటో డ్రైవర్లు

మద్దికెర: రాష్ట్రంలో రెండున్నరేళ్ల పాటు కరోనా వైరస్‌తో అన్ని కార్యకలాపాలు స్తంభించినా పేద ప్రజలు ఇబ్బందులు పడకుండా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల పక్షపాతిగా పేరు పొందారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గంపల వెంకటేశులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో వాహన మిత్ర సాయం పొందిన ఆటో డ్రైవర్లు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు నరసింహులు, కోశాధికారి అల్లీపీరా తదితరులు పాల్గొన్నారు.

వేదావతికి వరద

హొళగుంద: ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి వద్ద ఉన్న వేదావతి (హగరి) నది రెండు రోజులుగా వరద నీటితో కళకళలాడుతోంది. ఇన్నాళ్లు వర్షాలు లేక కళావిహీనంగా ఉన్న నదికి వరద నీరు రావడంతో సమీప గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పొలాలను వరద నీటితో తడిపేందుకు అనువుగా మారిందని రైతులు అంటున్నారు. ఆయకట్టు రైతులు మోటార్లతో పొలాలకు నీరు పెట్టుకుంటున్నారు.

గొర్రెల పెంపకంలో రాణించాలి

దేవనకొండ: గొర్రెల పెంపకందారులు ఉత్తమంగా రాణించి లాభాలు పొందాలని కర్నూలు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ దుర్గాప్రసన్న బాబు, రిసోర్స్ పర్సన్ డాక్టర్ రామసుబ్బారెడ్డి, పశువైద్యాధికారులు వెంకటేశ్వర్లు, జానకి సూచించారు. ఈ మేరకు శుక్రవారం దేవనకొండలోని పశు వైద్యశాలలో గొర్రెల పెంపకందారులకు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతులతో గొర్రెలు, మేకల పెంపకంలో లాభాలబాట, సన్నజీవాల పెంపకందారులు మందలోని పొట్టేళ్లను జన్యు సంబంధం లేని వేరే మంద నుంచి తీసుకొచ్చి పెంచినట్లయితే మంచి పిల్లలు పుట్టి జీవాల మరణాలను అరికట్టవచ్చన్నారు. సకాలంలో నట్టల నివారణ మందు వేయించాలని సూచించారు. బ్రీడింగ్, మేత విధానాలపై అవగాహన కల్పించారు.

ముగిసిన కంటి వైద్య శిబిరం

మద్దికెర: పోయిన కంటిచూపును తిరిగి పొందడం కొత్త అనుభూతిని అందిస్తుందని వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ఫ్రెండ్స్ విద్యానికేతన్ హైస్కూలులో గత పది రోజులుగా నిర్వహిస్తున్న కంటి వైద్యశిబిరం శుక్రవారం ముగిసింది. శిబిరంలో 203 మందికి చికిత్సలు అందించారు. మరో 230 మందికి ఆపరేషన్ నిమిత్తం చెన్నై లేదా కర్నూలుకు పంపనున్నట్లు తెలిపారు. కంటి పొర ఆపరేషన్ చేయించుకున్న వారికి జాగ్రత్తలు సూచించారు. వైద్య బృందం అరుణ్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశంలో రసాభాస

- రోడ్డు నిర్మించినా లేదంటూ విపక్ష సభ్యుల నానా యాగీ
- అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం
- నిర్మించిన రోడ్డును చూపడంతో అభాసుపాలైన టీడీపీ కౌన్సిలర్లు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మైనారిటీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో రూ.24 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మించి పది రోజులు గడిచినా కాలనీకి అసలు రోడ్డే లేదని విపక్ష సభ్యులు చేసిన ఆరోపణలను అధికారపక్ష సభ్యులు తిప్పికొట్టడంతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. శుక్రవారం స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో తన వార్డులో శిల్పా హాస్పిటల్ వైపు రోడ్డు మంజూరైన విషయంతో పాటు జరుగుతున్న పనుల గురించి అధికారులు సమాచారం ఇవ్వడం లేదంటూ కౌన్సిలర్ చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచన మేరకు కౌన్సిల్ ఆమోదంతోనే ఆ రోడ్డు మంజూరు చేసినట్లు కమిషనర్ గంగిరెడ్డి వివరించారు. విపక్ష కౌన్సిలర్ దయాసాగర్ మాట్లాడుతూ.. మైనారిటీ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని వాదించారు. స్పందించిన మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. మైనారిటీ కాలనీ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చొరవతో మున్సిపల్ అధికారులు రూ.24 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మించినా మీకు కనపడటం లేదా అంటూ నిలదీశారు. అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెడితే వారే ఛీ కొడతారని ధ్వజమెత్తారు. విపక్ష సభ్యులు వస్తే నిర్మించిన రోడ్డును చూపిస్తామన్నారు. కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం కూడా చేపట్టామని చెప్పడంతో నిర్మించలేదని విపక్ష సభ్యుడు బైఠాయించి నిరసన తెలిపారు. తమతో వస్తే రోడ్డు చూపిస్తామని వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు అమాన్, ఇషాక్, వాహిద్, రాజరత్నం తదితరులు చెప్పడంతో ఇరు పక్షాల మధ్య వాదోపవాదాలు పెరిగాయి. వారికి సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా లాభం లేకపోవడంతో చేసేది లేక చైర్మన్ సభ ముగిసినట్లు ప్రకటించారు. దీంతో సభ్యులు సభ నుంచి నిష్క్రమించారు. పట్టణంలో సోమప్ప, శివ సర్కిల్‌తో పాటు అన్నమయ్య సర్కిల్, శ్రీనివాస టాకీస్ సర్కిళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు రూ.28 లక్షలతో సిగ్నళ్ల ఏర్పాటుతో పాటు అజెండాలోని 50 అంశాలు, టేబుల్ అజెండాను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, టీపీఓ గోపాలకృష్ణతో పాటు వైస్ చైర్మన్ దివ్యకళ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



విపక్షసభ్యుల తప్పుడు ఆరోపణలను తిప్పికొడుతున్న అధికారపక్ష సభ్యులు

రూ.24 లక్షలతో రోడ్డు నిర్మించినా!

పట్టణంలోని మైనారిటీ కాలనీవాసుల కష్టాలు తీర్చేందుకు తక్షణమే గ్రావెల్ రోడ్డును నిర్మించాలని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ఆదేశించారు. మున్సిపల్ కౌన్సిల్ ఆమోదంతో జనరల్ ఫండ్ రూ.24 లక్షలతో కి.మీ మేర గ్రావెల్ రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఇటీవలే పూర్తి చేశారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ హయాంలోనే మైనారిటీ కాలనీలో రూ.29 లక్షలతో సీసీ రోడ్డును సైతం నిర్మించారు. అయితే మైనారిటీ కాలనీకి వెళ్లేందుకు రోడ్డే లేదని టీడీపీ కౌన్సిలర్లు శుక్రవారం కౌన్సిల్‌లో నానా యాగీ చేశారు. బైఠాయించి మరీ నిరసన తెలిపి అభాసుపాలయ్యారు. కనీసం రోడ్డు నిర్మించిన విషయం కూడా తెలియని విపక్ష సభ్యులు కౌన్సిల్‌లో మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అధికారపక్ష సభ్యులు



మైనారిటీ కాలనీకి నిర్మించిన గ్రావెల్ రోడ్డును చూపుతున్న వైస్ చైర్మన్

పేర్కొన్నారు. తాము నిర్మించిన రోడ్డును చూపుతూ ఇది టీడీపీ కౌన్సిలర్లకు కనిపించదా అని వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ ప్రశ్నించారు. అలాగే అర్బన్ హెల్త్ సెంటర్ రోడ్డు నుంచి మరో గ్రావెల్ రోడ్డుకు రూ.25 లక్షలు, కాలనీలో లింక్ రోడ్డుకు రూ.18 లక్షలు కేటాయించడం విశేషం.

పెన్షన్ కానుకకు రూ.2.16 కోట్లు

తుగ్గలి: వైఎస్సార్ పెన్షన్ కానుక కింద అక్టోబర్ నెల పింఛన్లకు మండలానికి రూ.2,16,05,250 నగదు మంజూరైంది. మండలంలో 7,807 మంది పింఛనుదారులుండగా వీరికి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిధులను విడుదల చేసినట్లు ఎంపీడీఓ సావిత్రి శుక్రవారం తెలిపారు. 1వ తేదీ (ఆదివారం) నుంచి గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు.

ఈ-క్రాప్ నమోదుకు నేడు ఆఖరు

ఆలూరు రూరల్: ఈ–క్రాప్ నమోదుకు శనివారంతో గడువు ముగుస్తుందని ఆలూరు ఏడీఏ సునీత అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్‌లో 5 మండలాల పరిధిలో మొత్తం 1,67,116 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. ఇప్పటి వరకు 1,67,046 వేల ఎకరాల పంటలకు ఈ–క్రాప్ నమోదు చేశామన్నారు. అలాగే 58 శాతం ఫార్మర్ ఈ–కేవైసీ పూర్తి చేసినట్లు చెప్పారు. మిగిలిన రైతులు ఈ రోజు సాయంత్రంలోగా నమోదు చేయించుకోవాలని సూచించారు.

నేటి నుంచి రాయితీ శనగ విత్తనాల పంపిణీ

ఈ ఏడాది రబీ సీజన్‌లో శనగ పంట సాగు చేసే రైతులకు రాయితీ విత్తనాల పంపిణీ శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు ఏడీఏ సునీత చెప్పారు. సబ్ డివిజన్‌లోని 5 మండలాలకు 25 వేల క్వింటాళ్ల జేజీ–11 రకం విత్తనాలు మంజూరయ్యాయన్నారు. క్వింటం పప్పు శనగ విత్తనాల ధర రూ.8,100 కాగా రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ అందిస్తుండగా రైతులు కింటాలుకు రూ.4,860 చెల్లించాల్సి ఉంటుదన్నారు. ఎకరానికి రెండు ప్యాకెట్లు (ఒక్కో టి 20 కేజీలు) చొప్పున ఒక రైతుకు గరిష్ఠంగా ఐదెకరాలకు విత్తనాలు అందించనున్నట్లు చెప్పారు.

అవినీతికి పాల్పడినందుకే చంద్రబాబు జైలుకు

ఆలూరు: టీడీపీ అధినేత మాజీ సీఎం చంద్రబాబు నాయుడుఅవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు అన్ని ఆధారాలు లభించాకే సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారని ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. ఆయనకు రిమాండ్ విధించిన జడ్జిలపై టీడీపీ నాయకులు సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టడాన్ని ఆయన ఖండించారు. అనంతరం ఎల్లార్తి రోడ్డు సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కార్యదర్శి శాంతకుమార్ సమక్షంలో శుక్రవారం పాలకవర్గం సభ్యులతో సమావేశం నిర్వహించారు. యార్డు అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం పంట ఉత్పత్తులకు ప్రభుత్వం ప్రకటించిన ధరల పోస్టర్‌ను విడుదల చేశారు. వైస్ చైర్మన్ ఈరన్న, పాలకవర్గం కమిటీ డైరెక్టర్లు, యార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పంట ఉత్పత్తుల ధరల పోస్టర్లను విడుదల చేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ నారాయణ

నంద్యాల జిల్లా వృషభాల రాజసం



రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని పుట్లూరు గ్రామంలో 6 రోజులుగా జరుగుతున్న శ్రీ మాతా మారెమ్మ బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన అంతర్ రాష్ట్రస్థాయి సీనియర్ విభాగం వృషభాల బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా, డోన్ మండలం, ధర్మవరం సుబ్బారెడ్డి వృషభాలు నిర్ణీత సమయంలో రాతిదూలాన్ని 3,400 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచాయి. కర్నూలు జిల్లా, పత్తికొండ మండలం, పందికోనకు చెందిన ఉప్పరి సుందరప్ప, నంద్యాల జిల్లా బిల్లాపురం గ్రామం భూమా గోవర్ధన్ రెడ్డి వృషభాలు ఉమ్మడిగా 3,175 అడుగులు, వెల్దుర్తి మండలం, చెరుకులపాడుకు చెందిన పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వృషభాలు 2,908 అడుగులు, వైఎస్సార్ జిల్లా, ప్రొద్దుటూరు మండలం, చౌటేపల్లికి చెందిన సర్పంచ్ మార్తాల చంద్ర ఓబుల్ రెడ్డి వృషభాలు 2,863 అడుగులు, ప్రొద్దుటూరు మండలం, కమనూరుకు చెందిన పెద్ద శివ కాంత్‌రెడ్డి వృషభాలు 2,822 అడుగుల లాగి తర్వాతి స్థానాల్లో నిలిచాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.70 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలను అందజేశారు. బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు, పోలీసు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గోనెగండ్ల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ అన్నారు. శుక్రవారం గోనెగండ్లలో స్వచ్ఛతే సేవా కార్యక్రమంపై మెయిన్ స్కూల్ విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. మెయిన్ స్కూల్ నుంచి బస్టాండ్ అక్కడ నుంచి పంచాయతీ కార్యాలయం మీదుగా కురువ పేట వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేకుండా పంచాయతీ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. షాపుల వారు తడి, పొడి చెత్తను డస్ట్ బిన్‌లలో ఉంచి పంచాయతీ వాహనంలో వేయాలని సూచించారు. సర్పంచ్ హైమవతి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని ఆత్మహత్య



హనుమంతు (ఫైల్)

తుగ్గలి: మండల పరిధిలోని మారెల్లకు చెందిన యాపదిన్నె హనుమంతు (60) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..హనుమంతు తనకున్న నాలుగెకరాలతో పాటు మరో 10 ఎకరాలు గుత్తకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వర్షాలు లేక కొన్నేళ్లుగా పంట దిగుబడులు సరిగా చేతికంద లేదు. కుటుంబ పోషణ, పంట పెట్టుబడుల కోసం చేసిన అప్పులు వడ్డీలతో కలిపి దాదాపు రూ.10 లక్షలకు చేరాయి. అప్పు ఎలా తీర్చాలన్న బెంగతో మనస్తాపానికి గురై గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తుగ్గలి ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు.

జిల్లాస్థాయిలో రాణించాలి

వెల్దుర్తి: ఈనెల 26, 27వ తేదీల్లో పత్తికొండలో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో 9 రకాల ఈవెంట్లలో సత్తా చాటిన 50కు పైగా క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ మండల ఇన్‌చార్జ్ నిర్మలాదేవి తెలిపారు. త్వరలో జిల్లా కేంద్రంలో జరిగే ఈ పోటీలలో రాణించాలన్న ఆకాభావం వ్యక్తం చేశారు. స్థానిక జ్యోతాబాపూలే బీసీ బాలికల గురుకులం నుంచి అండర్–14, అండర్–19 విభాగాలలో రన్నింగ్, త్రోబాల్, టెన్నికాయిట్, షాట్‌పుట్, ఖోఖో, లాంగ్ జంప్, యోగా తదితర ఈవెంట్లలో నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ చూపిన 16 మంది జిల్లాస్థాయికి ఎంపికైనట్లు పీఈటీ షబానా తెలిపారు.

కృష్ణగిరి: నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన కటారుకొండ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయ బృందం శుక్రవారం అభినందించారు. అండర్–14, 17 విభాగంలో విద్యార్థులు రాణించి పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం గోవిందురెడ్డి తెలిపారు. లాంగ్‌జంప్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, యోగా పోటీల్లో ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

వైద్య సేవల్లో లోటు రానీయొద్దు

నందవరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ దశరథ రామయ్య వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం గురజాల గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాట్లపై గ్రామ సర్పంచ్ వీరస్వామి ఆధ్వర్యంలో పీహెచ్‌సీ డాక్టర్ సౌజన్యలత నేతృత్వంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం శిబిరం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం గ్రామంలో వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. మహిళలు, బాలికలు చికిత్స పొందేందుకు అనుగుణంగా వసతులు ఏర్పాటు చేశామన్నారు. మహిళా డాక్టర్‌తో పాటు మరొక స్పెషలిస్టు డాక్టర్ అందుబాటులో ఉంటారని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, సీహెచ్‌ఓ బలరాం, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



గురజాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దశరథరామయ్య, డాక్టర్ సౌజన్యలత

గుప్త నిధుల తవ్వకాలపై ఫిర్యాదు

దేవనకొండ: కరిడికొండలో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 835లో గుప్త నిధుల కోసం కొందరు తవ్వకాలు జరిపారని వీఆర్వో బి.రాజన్న శుక్రవారం ఫిర్యాదు చేశారు. తవ్వకాలు చేపట్టిన దుండగులు స్థానికులు రావడంతో కరిడికొండ గ్రామ శివారులో ఏపీ 21 బీఎం 9311 నంబరు గల కారును చెట్టు కింద వదిలి వెళ్లిపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు.

ముగిసిన వ్యాసరచన పోటీలు

వెల్దుర్తి: భగవాన్ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు శుక్రవారం ముగిశాయి. మొత్తం 481 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నట్లు స్థానిక సత్యసాయి భజన మండలి అధ్యక్ష, కార్యదర్శులు తిరివీధి సాయిప్రసాద్, ఒంగోలు సాయి తెలిపారు. రాష్ట్రస్థాయిలో విజేతలను ఎంపిక చేసి ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు జిల్లా బాల వికాస్ కన్వీనర్ సాయి కృష్ణారెడ్డి తెలిపారు.

బీమా తక్షణ సాయం అందజేత

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణం కల్లుపెంటవీధిలో నివాసం ఉంటున్న దుద్దు కుమార్ అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో మృతిచెందాడు. ఆయన పేరిట వైఎస్సార్ బీమా నమోదై ఉండడంతో గ్రామ సచివాలయ సిబ్బంది రూ.10 వేల తక్షణ సాయాన్ని ఎంపీపీ నారాయణదాసు చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

హంపికి బయలుదేరిన భక్తులు

ఆలూరు: మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో కొలువుదీరిన శ్రీ ఉచ్చీరప్ప తాత ఉత్సవమూర్తి పల్లకోత్సవం, నందికోలు సేవతో భక్తులు శుక్రవారం ఊరేగింపుగా హంపికి బయలుదేరి వెళ్లారు. గ్రామం నుంచి సుమారు రెండు వేల మందికి పైగా భక్తులు కాలినడకన మర్రి తాత మఠం ఆవరణకు చేరుకోగా బంగ్లా బజారప్ప కుటుంబ సభ్యులు భోజన సౌకర్యం కల్పించారు. అనంతరం ఉచ్చీరప్ప తాతను మేళతాళాలతో గ్రామస్తులు సాగనంపారు. వీరు హాలహర్వి మండలం విరుపాపురం గ్రామం మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని కంప్లీ నుంచి హంపిలో కొలువుదీరిన విరుపాక్షయ్య స్వామి దేవస్థానం ఆవరణలో శుద్ధజలంతో ఉచ్చీరప్ప తాతకు అభిషేకం చేస్తారు. భక్తులు తిరిగి వచ్చే నెల 5వ తేదీన పెద్దహోతూరు గ్రామం చేరుకుంటామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

కఠిన శిక్షలతోనే నేరాల నియంత్రణ

ఎమ్మిగనూరు టౌన్: నేరాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు అమలు చేస్తేనే మిగతా వారికి భయం ఉంటుందని జమాతే ఇస్లాం నాయకులు అమీర్ అన్నారు. పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సనాతన ధర్మం, నేటి పరిస్థితి చర్చాగోష్టి సమావేశం నిర్వహించారు. నేరాల నియంత్రణపె వక్తలు మాట్లాడారు.

న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

పత్తికొండటౌన్: న్యాయవాదుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన కృషి ఎనలేనిదని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ జోనల్ ఇన్‌చార్జ్ మిరపకాయల ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు సువర్ణారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పత్తికొండ బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో వారు సమావేశం అయ్యారు. వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ సీఎం అయిన వెంటనే న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.100 కోట్లు కేటాయించారన్నారు. లా నేస్తం ద్వారా జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5వేలు స్టైఫండ్, హెల్త్‌కార్డుల జారీ, కరోనా సమయంలో అడ్వాన్సు చెల్లింపులతో న్యాయవాదులకు అండగా నిలిచారన్నారు. అలాగే కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు సీఎం అంగీకారం తెలిపారన్నారు. న్యాయవాదులంతా జగనన్నకు అండగా నిలవాలని కోరారు. బార్‌అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రంగస్వామి. సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు న్యాయవాదులు సంపూర్ణ సహకారం అందించాలని పార్టీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ మిరపకాయల ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు సువర్ణరెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలో న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: అలాగే ఆలూరులోని ప్రభుత్వ అతిథి గృహంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఆలూరు తాలుకా కన్వీనర్ లక్ష్మికాంత్, న్యాయవాదులు నాగరాజు, మోహన్, తిమ్మయ్య,గోవిందు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పార్టీ లీగల్‌సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ప్రభాకర్

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో వెలసిన చౌడేశ్వరి దేవి దేవాలయంలో శుక్రవారం జ్యోతి మహోత్సవాల ఊరేగింపు వైభవంగా జరిగింది. ఊరేగింపులో యువత తమ నాలుక, దవడ, మెడ, చేతులపై కడ్డీలు గుచ్చుకొని భక్తిని చాటుకున్నారు. అలాగే కత్తులతో విన్యాసాలు చేస్తు తమ శరీరం, చేతులపై గాట్లు పెట్టుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆచారంలో భాగంగానే ఇలాంటి విన్యాసాలు చేస్తున్నామని భక్తులు తెలిపారు.



జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుల నియామకం

క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపట్టింది. మున్సిపాలిటీలు, మండలాల వారీగా అధ్యక్షులను నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కమిటీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నియామకాలపై పార్టీ కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



పెద్దయ్య
ఆస్పరి



బుట్టారంగయ్య
ఎమ్మిగనూరు క్లస్టర్-1



నజీర్‌అహమ్మద్
ఎమ్మిగనూరు క్లస్టర్-2



బీఆర్.బసిరెడ్డి
ఎమ్మిగనూరు మండలం



దొరబాబునాయుడు
గోనెగండ్ల



జె.శివారెడ్డి
నందవరం



రవీంద్రనాథ్ రెడ్డి
వెల్దుర్తి



వెంకటరాముడు
కృష్ణగిరి



వెంకటేశ్వర్లు
మద్దికెర



వీరేష్
ఆలూరు



మల్లికార్జున
దేవనకొండ



జూటూరు మారయ్య
చిప్పగిరి



భీమప్పచౌదరి
హాలహర్వి



షఫివుల్లా
హొళగుంద

నేటి నుంచి వైద్య శిబిరాలు

ఆలూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ అల్లబకాష్, ఈఓఆర్డీ ప్రకాష్‌నాయుడు, డాక్టర్ మారుతి ఏర్పాట్లను పరిశీలించారు. ఐదు దశల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గత 15 రోజులుగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేసి 230 మందికి చికిత్స కోసం టోకెన్లు అందించారు. శనివారం శిబిరంలో మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్‌తో పాటు ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించనున్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు ఆరోగ్య శ్రీ కింద ఆపరేషన్లు చేయించి మెరుగైన వైద్యం అందించనున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి హెల్త్ క్యాంపును విజయవంతం చేయాల ని సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష షెడ్యూల్ ఇలా..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం ఆలూరు సచివాలయం–1లో ప్రారంభించి అక్టోబర్ నెల 30వ వరకు నిర్దేశించిన తేదీల్లో ఆయా గ్రామాల్లో నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. 4వ తేదీ సచివాలయం–3లో, 7న మొలగవల్లి కొట్టాల, 9న కురుకుందలో 10న మొలగవల్లి సచివాలయం–1లో, 11వ తేదీ అరికెర గ్రామ సచివాలయం, 13న హులేబీడు, 12న పెద్దహోతూరు గ్రామంలో, 16వ తేది ఆలూరు సచివాలయం–2 ఆవరణంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తుండగా.. 18వ తేదీన ఆలూరు సచివాలయం–4 నందు, 20న మరకట్టు గ్రామంలో 21న మనేకుర్తి, 26వ తేదీ మూసానహళ్లి, 27న తేదీన కురువళ్లి గ్రామంలో 30వ తేదీ హత్తిబెళగల్ గ్రామ సచివాలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

నేడు వెల్దుర్తి బాలుర హైస్కూల్‌లో హెల్త్ క్యాంప్

వెల్దుర్తి: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా 30వ తేదీ శనివారం స్థానిక బాలుర హైస్కూల్లో మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావ్ తెలిపారు. రామళ్లకోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వెల్దుర్తి–1 సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలోని వారికి నిర్వహించే ఈ క్యాంప్‌లో రామళ్లకోట, గోవర్ధనగిరి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సిరిమిల్ల ప్రతిభ, డాక్టర్ నవీన్ కుమార్, స్పెషలిస్టు వైద్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి చెందిన డాక్టర్ పవన్ తేజ, డాక్టర్ వెంకట మహేశ్‌నాయక్‌తో పాటు కంటి వైద్య నిపుణు లు అందుబాటులో ఉండి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 162 రకాల మందులు, 18 రకాల శస్త్ర చికిత్స వస్తువు లు, 14రకాల ఎమర్జెన్సీ కిట్లు అందుబాటులో ఉంచుతామన్నారు. ఇప్పటికే వెల్దుర్తి–1 పరిధిలో ఈనెల 16వ తేదీ నుంచి 28 మంది వలంటీర్లు, ఏఎన్‌ఎం, ఎమ్‌ఎల్‌హెచ్‌పీలు 1684 ఇళ్లలో సర్వే నిర్వహించి 4,724 మందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారన్నారు. వీరిలో వైద్య చికిత్స అవసరమైన 485 మందిని గుర్తించి టోకెన్లు అందించారు. వీరందరికీ శనివారం వైద్య శిబిరంలో మెరుగైన వైద్య సేవలు అందించనున్నారు. అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా అపరేషన్ చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మద్దికెర: మండల పరిధిలోని బసినేపల్లి గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో శనివారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ తెలిపారు.

గోనెగండ్ల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శనివారం నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ తెలిపారు. శనివారం బైలుప్పల గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి శిబిరం ప్రారంభం అవుతుందన్నారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామ సచివాలయ ఆవరణంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు. అమకతాడు గ్రామంలో శుక్రవారం ఆయన డాక్టర్ ప్రదీప్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభిస్తారని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి తెలిపారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక శిల్పా ఎస్టేట్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డితో పాటు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.